@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...


తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || శనివారం 13, జూలై 2024 || పేజీలు: 04

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:

తెలంగాణలో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ గూటికి చేరారు. సీఎం రేవంత్ సమక్షంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే హస్తం పార్టీలో చేరిపోయారు. దీంతో, కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంఖ్య ఎనిమిదికి చేరింది. కాగా, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ హస్తం పార్టీలోకి మిగతా 2లో..





## విస్తృత సేవలందించేలా హైడ్రా

- అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా..
- జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగాకొత్త వ్యవస్థ ఏర్పాటు
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 12:

నగర విస్తరణకనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలు అందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) రూపుదిద్దుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా వ్యవస్థాగత నిర్మాణం, విధివిధానాలపై మరింత అధ్యయనం చేసి.. కసరత్తు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీతో పాటు, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకొని మరింత సమర్థంగా హైడ్రా పనిచేసేలా ఉండాలంటూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పుడున్న ఎన్‌ఫోర్స్ మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. కొత్త విభాగంలో ఏఏ స్థాయి అధికారులుండాలి? ఎంతమంది సిబ్బంది ఉండాలి? ఏఏ విభాగాల నుంచి వీరిని డిప్యుటేషన్ మీద తీసుకోవాలి? తదితర అంశాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. మిగతా 2లో..



## నైనీ గనులకు ఒడిశా సర్కారు ఓకే

- గనుల తవ్వకానికి సహకరిస్తాం
- ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంజీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతికి వెంటనే స్పందన
- ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం
- రాయల్టీగా ఏటా ఒడిశాకు రూ.600 కోట్లు: భట్టి వెల్లడి



హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:

ఒడిశా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు గనిలో బొగ్గు ఉత్పత్తికి పూర్తిగా సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి మోహన్‌చరణ్ మాంజీ స్పష్టం చేశారు. ఆ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు హామీ ఇచ్చారు. దశాబ్దం కిందట ఆ బొగ్గు గనిని సింగరేణికి కేటాయించినా అక్కడ ఒక్క తట్ట బొగ్గు కూడా ఉత్పత్తి చేయలేదు. ఇప్పుడు బొగ్గు తవ్వకాలకు అన్ని రకాల అనుమతులు వచ్చిన నేపథ్యంలో.. ఆ రాష్ట్ర ప్రభు త్వ సహకారాన్ని కోరేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సచివాలయంలో మాంజీని కలిసి విజ్ఞప్తి చేశారు. మిగతా 2లో..

## పిడుగు పడి 25మంది మృతి

పట్నా, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:

బిహార్‌లో 24గంటల వ్యవధిలో చోటుచేసుకున్న వేర్వేరు పిడుగుపాటు ఘటనల్లో 25 మంది మరణించారు. 39 గాయపడ్డారు. ఈ కారణంగా కిషన్ మిగతా 2లో..




➤ వివరాలు 03లో..

## సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ఊరట

- ఢిల్లీ లిక్కర్ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు..

2



## జూన్ 25 రాజ్యాంగ హత్యా దినం

### ఎమర్జెన్సీ ప్రకటించిన రోజుపై కేంద్రం సంచలన నిర్ణయం..

- ఆ చీకటి రోజులకు నిరసనగానే: అమిత్ షా
- ఎమర్జెన్సీ.. దేశ చరిత్రపై కాంగ్రెస్ రాసిన చీకటి అధ్యాయం..: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:

దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏటా జూన్ 25ను ఈ విధంగానే వ్యవహరించాలంటూ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. '1975 జూన్ 25న ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ నియంతలా మారి ప్రజాస్వామ్యం గొంతునొక్కారు. మీడియాను అణచివేశారు. కారణం లేకుండా లక్షలమందిని జైల్లో పెట్టారు. ఎమర్జెన్సీ బాధితులు, దానిపై పోరాడిన వీరులను స్మరించుకునేందుకు, ఆ చీకటి రోజులను గుర్తుచేసుకునేందుకు మిగతా 2లో..




నేటి ఫోకస్ న్యూస్

శనివారం 13, జూలై 2024

# పిడుగు పడి 25మంది మృతి

(మొదటి పేజీ తరువాయి..)

గంజ్, అరారియా జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.4లక్షల వంతున పరిహారం చెల్లించనున్నట్టు సీఎం నీతీశ్ కుమార్ తెలిపారు. పిడిగుపాటు కారణంగా ఈ నెలలో ఇంతవరకు 50 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. గురువారం బర్కాగాం గ్రామంలోని పాఠశాల సమీపంలోని తాటిచెట్టుపై పిడుగుపడడంతో 22 మంది విద్యార్థులు గాయపడ్డారు.



# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి..)

ఆహ్వానించారు. ఇక, తాజాగా ప్రకాశ్ గౌడ్ చేరికతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన వారి సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. మరోవైపు.. రేపు మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారని హస్తం పార్టీ నేతలు చెబుతున్నారు.

# జంట హత్యల కేసులో నిందితుడి అరెస్ట్

**– నాగరాజును అరెస్ట వివరాలు వెల్లడించిన డిసిపి**

వరంగల్, (నేటి ఫోకస్‌న్యూస్), జూలై 12:

వరంగల్ జిల్లాలో జంట హత్యల కేసులో నిందితుడు నాగరాజును అరెస్టు చేసినట్టు డీసీపీ రవీందర్ తెలిపారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారు చింతల్‌తండాలో జరిగిన దారుణ ఘటన వివరాలను నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ వెల్లడించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి దక్కట్లేదనే హత్యలు చేశాడు. 9వ తరగతి నుంచి అమ్మాయి, ఆటో డ్రైవర్ మేకల నాగరాజు అలియాస్ బన్నీతో పరిచయం ఉంది. అమ్మాయి మేజర్ అయ్యాక ఎవరికీ తెలియకుండా పెళ్లి చేసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత అతనితో ఉండలేనని దీపిక (21) పుట్టింటికి వచ్చేసింది. దీపిక దక్కకపోవడానికి తల్లిదండ్రులు బానోతు శ్రీనివాస్ (45), సుగుణ (40) కారణమని వారిపై కక్ష పెంచుకుని నాగరాజు హత్య చేశాడు. అందరినీ చంపేద్దామనే గురువారం తెల్లవారుజామున వేట కొడవలి తీసుకొని యువతి ఇంటికి వెళ్లాడు. బయట నిద్రిస్తున్న శ్రీనివాస్, సుగుణలపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. తల్లిదండ్రుల కేకలు విని బయటకు వచ్చిన దీపిక, మదన్‌లాల్‌లపై కూడా దాడి చేశాడు. దాడి తర్వాత అడ్డొచ్చిన వారిని బెదిరించి అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడికి ఎవరూ సహకరించలేదు. హత్య జరిగిన తర్వాత పోలీసులు త్వరగా స్పందించారు. చట్టప్రకారం నిందితుడికి శిక్ష పడేలా చూస్తాం అని డీసీపీ రవీందర్ తెలిపారు.

# సుప్రీంకోర్టులో కేజ్రీవాల్‌కు ఊరట

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:

సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ కు ఊరట లభించింది. ఆయనకు సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ తీర్పును వెలువరించింది. ఢిల్లీ లిక్కర్ ఈడీ మనీలాండరింగ్ కేసులో ఆయనకు ధర్మాసనం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ కేసులో అరెస్టయినందున ఆయన తిహార్ జైల్లోనే ఉండనున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో తన అరెస్ట్ అక్రమం అని కేజ్రీవాల్ వేసిన పిటిషన్ ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసినట్టు జస్టిస్ సంజీవ్ కన్నా ధర్మాసనం తెలిపింది. గత నెల 27వ తేదీన ఢిల్లీ లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తిహార్ జైల్లో కేజ్రీవాల్ ఉన్నారు. ఢిల్లీ మద్యం విధానం మనీలాండరింగ్ కేసులో ఏప్రిల్ 9న ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్త నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేజ్రీవాల్ పిటిషన్ పై విచారణ జరిపింది. కేజ్రీవాల్, ఈడీ వాదనల అనంతరం మే 17న తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఆ తరవాత జూన్ 20న కేజ్రీవాల్‌కి రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేయగా... మరుసటి రోజే ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది.

# నైనీ గనులకు ఒడిశా సర్కారు ఓకే

(మొదటి పేజీ తరువాయి..)

బొగ్గు గని ఆవశ్యకతను తెలంగాణ డిప్యూటీ సీఎం వివరించారు. ఈ మేరకు అన్ని వివరాలతో కూడిన లేఖను ఒడిశా సీఎంకు అందజేశారు. స్పందించిన ఒడిశా సీఎం మోహన్‌చరణ్ మాంజీ.. భూముల బదలాయింపు, విద్యుత్, రహదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తమ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నైనీ బ్లాకులో గనుల తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనుమతులు సైతం వచ్చాయని డిప్యూ టీ సీఎం భట్టి ఈ సందర్భంగా తెలిపారు. అటవీ, ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్య పరిష్కారమైన వెంటనే సింగరేణి తవ్వకాలను ప్రారంభిస్తుందని వివరించారు. నైనీ బ్లాక్‌లో తవ్వకాలు చేపట్టడం ద్వారా 1,200మందికి ఉపాధితో పాటు పన్నుల రూపంలో రూ.600 కోట్ల వరకు ఒడిశాకు రాయల్టీ రూపంలో ఆదాయం సమకూరుతుందని మాంజీ దృష్టికి తెచ్చారు. ప్రతీ ఏటా ఇక్కడ నుంచి పది మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. బొగ్గు గనుల వద్దనే 2,800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి ఏర్పాటు చేస్తుందని భట్టి ప్రకటించారు.

# విస్తృత సేవలందించేలా 'హైడ్రా'

(మొదటి పేజీ తరువాయి..)

జీహెచ్ఎంసీతోపాటు హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు 2 వేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పనిచేయాల్సి ఉంటుందని, పనివిభజనకు వీలుగా సిటీలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధి నిర్దేశించాలని సీఎం సూచించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలని చెప్పారు. హైడ్రా ఏర్పాటు, సంబంధిత విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్ఎంసీ ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్, సీఎంఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేకకార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



**కీలక బాధ్యతలు..:** విపత్తుల నిర్వహణతోపాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయటం, ఆక్రమణలు తొలగించటం, అక్రమ నిర్మాణాలు, నిబంధనలను పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రకటనల తొలిగింపు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరాలో హైడ్రా కీలకంగా వ్యవహరించేలా విధులు అప్పగించాలని సీఎం చెప్పారు. హెచ్ఎండీఏ, వాటర్‌వర్క్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీల తొలగింపు, అపరాధ రుసుము వసూలు బాధ్యత హైడ్రాకు బదలాయించాలన్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలని సూచించారు.

# జూన్ 25 రాజ్యాంగ హత్యా దినం

(మొదటి పేజీ తరువాయి..)


జూన్ 25ను రాజ్యాంగ హత్యా దినం (సంవిధాన్ హత్యా దివస్)గా నిర్వహించాలని నిర్ణయించాం" అని పేర్కొన్నారు. షా ప్రకటన అనంతరం ప్రధాని మోదీ స్పందించారు. "ఎమర్జెన్సీ.. దేశ చరిత్రపై కాంగ్రెస్ పార్టీ రాసిన చీకటి అధ్యాయం. నాడు రాజ్యాంగాన్ని తొక్కిపెట్టి పరిపాలన సాగించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునే రోజు" అని ట్వీట్ చేశారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థ వంటి రాజ్యాంగ వ్యవస్థలను బలహీనం చేస్తోందంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, ఇతర ప్రతిపక్షాల నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని ఎన్నికల వేళ విపక్షాలు పెద్దఎత్తున ప్రచారం చేశాయి. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనూ రాహుల్ సహా 'ఇండియా' ఎంపీలు పలువురు రాజ్యాంగ ప్రతులతో హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ సర్కారు జూన్ 25ను "రాజ్యాంగ హత్యా దినం"గా ప్రకటించింది. ఇదిలా ఉండగా, మోదీ హయాంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలతో కోట్లాది ప్రజల జీవితాలు ఛిన్నాభిన్నం అయ్యాయని, త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా దేశ ప్రాథమిక ఆర్థిక అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రధాని మోదీకి సూచించారు..

# 16న కలెక్టర్లు, ఎస్పీలతో సిఎం భేటీ

- ప్రజాపాలనకు తొలి ప్రాధాన్యం..
- ధరణిపైనా చర్చ
- లా అండ్ ఆర్డర్, డ్రగ్స్ అరికట్టడంపై డిస్కషన్
- విద్య, వైద్యం, వ్యవసాయానికీ ప్రాధాన్యం
- వన మహోత్సవం, మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 16న సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తొమ్మిది అంశాలతో కూడిన ఎజెండా ఖరారయ్యింది. 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యత సంతరించుకుంది. తొమ్మిది అంశాలే ఎజెండాగా నిర్వహించబోయే ఈ సమావేశంలో క్షేత్ర స్థాయి పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం ఆరా తీయనున్నారు. ఇందులో ప్రజాపాలన దరఖాస్తుల గ్రౌండింగ్, అమలు ప్రస్తుత పరిస్తితిపై చర్చించనున్నారు. దీంతో పాటు ధరణిపై ప్రభుత్వం సబ్ కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వస్తున్న అభ్యంతరాలు.. వాటికి పరిష్కార మార్గాలపైనా సమావేశం చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నడుస్తున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువుల సమస్యలపైనా డిస్కస్ చేయనున్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలలు, గురుకులాల్లోని అంశాలపై చర్చ జరగనుంది. సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, ఎపిడమిక్ సెల్ ల పనితీరు... సర్కారు దవాఖానాల్లో వైద్య సేవల తీరు.. మందుల అందుబాటు తదితర అంశాలపై సీఎం చర్చిస్తారని తెలుస్తోంది. వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్న రేవంత్ సర్కారు ఆరోగ్య శ్రీ పథకం కింద గత ప్రభుత్వ హయాంలో ఉన్న రూ. 5లక్షల సాయాన్ని 10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఆరోగ్య శ్రీ సేవలపైనా సీఎం ఆరా తీయనున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పై ఎస్పీలతో సీఎం చర్చించనున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపైనా ఆరా తీయనున్నారు. ముఖ్యంగా డ్రగ్స్ కంట్రోల్ పై ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే.. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఆరా తీయనున్నారు. రాష్ట్రం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమేందుకు ఏం చేయాలనే అంశాన్ని ఎస్పీలతో చర్చించే అవకాశం ఉంది. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నది. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు తమ స్టైల్ ను మార్చి లూటీ చేస్తున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉంది. ఏది ఏమైనా బదిలీలు, పదోన్నతుల తర్వాత.. బడ్జెట్ సమావేశాలకు ముందస్తుగా జరుగుతున్న ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది.



# నిస్సిగ్గుగా ఫిరాయింపులు

- నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నారు
- గాంధీభవన్, తెలంగాణ భవన్‌ల మధ్య తేడా లేదు
- రాష్ట్రాన్ని దోచి ఢిల్లీకి సూట్‌కేసులు పంపుతున్నారు
- సీఎం రేవంత్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- కేసీఆరే ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపుతున్నారు
- రాహుల్.. దమ్ముంటే ఓయూకు రా: సంజయ్
- బీజేపీ అధికారంలోకి వస్తే కార్యకర్తే సీఎం: ప్రధాన్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:

రాష్ట్రంలో నిస్సిగ్గుగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని ముఖ్యమంత్రి నడిరోడ్డుపై అవహేళన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రధానంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం, రాష్ట్రాన్ని దోపిడీ చేసి ఢిల్లీకి సూట్‌కేసులు పంపించడం మాత్రమే జరుగుతున్నాయని చెప్పారు. పార్టీ ఫిరాయించినవారిని అనర్హులుగా ప్రకటించాలంటూ ఎన్నికల ముందు న్యాయ్‌పత్ర్‌లో పేర్కొన్న కాంగ్రెస్, ఇప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ఈ విషయంలో బీఆర్ఎస్ కంటే తామేం తక్కువ కాదన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. శుక్రవారం శంషాబాద్‌లో జరిగిన బీజేపీ రాష్ట్రస్థాయి విస్తృత కార్యవర్గ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణ, స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ సమావేశంలో చర్చించారు. బీజేపీ సభ్యత్వం, సంస్థాగత ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల ఫలితాలపైనా చర్చ జరిగింది. సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విచిత్ర రాజకీయ పరిస్థితి కొనసాగుతోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని.. ఆ రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని, కవలపిల్లలని వ్యాఖ్యానించారు. గాంధీభవన్, తెలంగాణ భవన్ మధ్య తేడా లేదన్నారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నాడు కేసీఆర్ కూటమి పార్టీలకు నిధులు పంపిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి సూట్‌కేసులు పంపిస్తోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస‌లో చేరితే, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస‌లో చేరుతున్నారని చెప్పారు. నిండు సభలో 'జైపాలస్తీనా' అని నినాదం చేసిన ఒవైసీకి కొమ్ముకాస్తున్నందుకు కాంగ్రెస్, బీఆర్ఎస‌లకు సిగ్గుండాలన్నారు. తాము రాష్ట్రంలో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెసకు బీజేపీయే ప్రత్యామ్నాయం అని ప్రజలు తీర్పు ఇచ్చారని తెలిపారు. త్వరలో సభ్యత్వ నమోదుకు సిద్ధం కావాలని కిషన్‌రెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

## సామాన్య కార్యకర్తే సీఎం: ప్రధాన్

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సామాన్య కార్యకర్త సీఎం అవుతారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ ముఖ్యమంత్రి ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ మూడు నుంచి రెండో స్థానానికి చేరిందని, ఇక నంబర్ వన్ స్థానమే లక్ష్యమని చెప్పారు. పార్టీ నాయకులంతా కష్టపడి 2028లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. 35 వేల పోలింగ్ బూత్‌లను పటిష్ఠం చేయాలని, యువతను పార్టీలో చేర్పించాలని సూచించారు. పార్టీలో పాత, కొత్త లేదని.. ఎంపీ ఈటల రాజేందర్ పాత నేత అయిపోయారని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెసకు 13 రాష్ట్రాల్లో ఒక్క ఎంపీ కూడా లేరన్నారు. మిత్రపక్షాలు దూరమైతే కాంగ్రెసకు 50 సీట్లు కూడా వచ్చేవి కాదని చెప్పారు.

## సెక్యూరిటీ లేకుండా రాహుల్‌కు ఓయూలో తిరిగే దమ్ముందా?: బండి సంజయ్

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా వ్యాపిస్తోందంటూ మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నా. తెలంగాణలో మీ కాంగ్రెస్ పార్టే అధికారంలో ఉంది కదా! సెక్యూరిటీ లేకుండా మీకు ఉస్మానియా యూనివర్శిటీలో తిరిగే దమ్ముందా? తెలంగాణలో నిరుద్యోగం అంటువ్యాధిలా ఏ స్థాయిలో విస్తరిస్తుందో వారిని కలిసి మాట్లాడితే తెలుస్తుంది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీయే అంటువ్యాధి లాంటిది. మోదీరోజ్‌గార్ మేళాతో 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. అయినా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిరుద్యోగం అంటువ్యాధిలా విస్తరిస్తోందని రాహుల్ గాంధీ చెప్పడం సిగ్గు చేటు"అని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు.


## రిటైర్డ్ పోలీసు అధికారిని చైర్మన్ చేయడం వల్లనే సమస్యలు: ఎంపీ రఘునందన్


"ప్రభుత్వం ఓ రిటైర్డ్ పోలీసు అధికారిని టీజీపీస్సీ చైర్మన్‌గా నియమించింది. ఆయన పదవీకాలం డిసెంబర్‌తో ముగియనుంది. తన హయాంలో ఉద్యోగాలు భర్తీ చేయాలన్న తప్పుడు ఆలోచనతోనే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. డీఎస్సీ కోసం మరో 45 రోజుల సమయం కేటాయించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గ్రూప్%-%1,2,3 ఉద్యోగ పోస్టులను పెంచకుండా నిరుద్యోగులను మోసం చేసింది. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 ఎంపిక చేయాలని ప్రతిపక్షంలో ఉండగా, ఇదే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిండు సభలో గుర్తు చేశారు"అని ఎంపీ రఘునందన్ పేర్కొన్నారు. నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనకు బీజేపీ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలున్నా కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదనీ, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణ జరిపించాలని మాట్లాడిన రేవంత్ ఇప్పుడెందుకు నోరుమెదపడం లేదని రఘునందన్ నిలదీశారు.

## కాలేజీల నుంచి ఆర్ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు: ఈటల

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల యాజమాన్యాల నుంచి కూడా ఆర్ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. అందుకే విద్యార్థుల నుంచి యాజమాన్యాలు ఎక్కువ డబ్బులు తీసుకునే దుస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టర్లు, సర్పంచులు చేసిన పనులకు బిల్లులు ఇచ్చే అధికారం తమకు లేదంటూ ఆర్థిక శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారన్నారు. శుక్రవారం శంషాబాద్‌లో బీజేపీ విస్తృత సమావేశం సందర్భంగా ఈటల మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బిల్లుకి 8 శాతం డబ్బులు ముందు చెల్లిస్తేనే బిల్లులు విడుదల చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ డబ్బులు కూడా లంచం ఇస్తే తప్ప వచ్చేలా లేవన్నారు.







# బోనాల ఉత్సవాల ఆలయ కమిటీ సభ్యులకు చెక్కుల పంపిణీ

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలి
- 218 ఆలయాలకు చెక్కుల పంపిణీ చేసిన కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 12:**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ఆలయ కమిటీ సభ్యులకు, తిరుమలగిరి ఇన్ చార్జి తహసిల్దార్, మారేడ్ పల్లి అశోక్ తో కలిసి, ఎమ్మెల్యే శ్రీ గణేష్ చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం నాడు నియోజకవర్గంలోని మారేడుపల్లి నెహ్రూ నగర్ ప్రాంగణంలో, నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆలయాల నిర్వాహకులకు 218 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... నా చేతుల మీదుగా బోనాల ఉత్సవాల చెక్కులు అందించడం, మరియు మీ అందరిని ఇక్కడ కలవడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. బోనాలు జరుపుకుంటున్న సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలను జరుపుకోవాలని, ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. బోనాలు ఉత్సవాలు జరుపుకుంటున్న కంటోన్మెంట్ ప్రజలందరికీ ఎటువంటి ఇబ్బందులు కలవకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకునే విధంగా అన్ని శాఖలతో అధికారులతో నిర్వహిస్తామని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆండాలు, మారేడుపల్లి డిప్యూటీ తాసిల్దార్ శివకుమార్, భద్రన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి మధుకర్, నాగినేని సరిత, ధనలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

- ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధింపులు
- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**వరంగల్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. కాం గ్రెస్ పాలనలో హత్యలు, నేరాలు పెరిగిపోయా యని విమర్శించారు. హామీలపై నిలదీస్తే అధి కార పార్టీ నేతలు పోలీసులతో వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయ కులతో కలిసి ఆయన నర్సంపేటలో మీడియాతో మాట్లాడారు. గిరిజన కుటుంబంపై దాడి ఘట నతో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతున్నదని చె ప్పారు. ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని తెలి పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఆ పార్టీ స్థానిక ఎమ్మెల్యేలు ఉమ్మడి వరంగల్ జిల్లాకు పైసా నిధులు తేలేదని విమర్శించారు. కాంగ్రెస్ నేతల అడుగులకు మడుగులొత్తే అధి కారులకు పోస్టింగులు ఇస్తున్నారని ఆరోపించారు. విచ్చలవిడిగా పోలీస్ అధికారుల బదిలీలు జరు గుతున్నాయని చెప్పారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ నేతలకు కమీషన్లు, పంపకాల మీద ఉన్న దృష్టి పాలనపై లేదని విమర్శించారు. గ్రామాల్లో ఆ పార్టీ నేతల వేధింపులు పెరిగాయన్నారు. ఏ పోలీస్ స్టేషన్ చూసినా రోజూ వందలమంది కనిపిస్తున్నా రని చెప్పారు. పోలీసు పోస్టులను కాంగ్రెస్ నేతలు బేరాలకు పెట్టారని ఆరోపించారు. ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా ఉమ్మడి జిల్లా నేతలంతా వస్తారని చెప్పారు. ఎక్కడ అన్యాయం జరిగినా నిలదీస్తామన్నారు.

# బ్రాహ్మణ సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

- బ్రాహ్మణ పరిషత్‌ను నిర్వీర్యం చేసే కుట్ర
- హరీశ్ రావు విమర్శలు

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**

బ్రాహ్మణ సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. సంక్షేమ పరిషత్ ద్వారా అమలు చేసే పథకాలు నిలిచి పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అగమ్యగోచరంగా కావడం బాధా కరమని చెప్పారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశా రు. విద్య, స్వయం ఉపాధి, వేద విద్యకు ప్రోత్సా హం కోసం అమలు చేసిన పథకాలు ఆగిపోవడం విచారకరమని అందులో పేర్కొన్నారు. రాష్ట్రంలో అసలు బ్రాహ్మణ పరిషత్ ఉన్నట్టా? లేనట్టా అనే ఆందోళన బ్రాహ్మణ సామాజికవర్గంలో నెలకొన్నదని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కోసం కేసీఆర్ ఏటా రూ.100 కోట్లు కేటాయించారని చెప్పారు. 'వివేకానంద' పేరుతో విదేశీ విద్యా పథకం, 'శ్రీ రామానుజ' పేరుతో ఫీజు రీయంబర్స్ మెంట్ పథకం, 'వేదహిత' పేరుతో వేద పాఠశాలలకు వేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, ప్రతి నెల వేద శాస్త్ర పండితులకు గౌరవ వేతనం, ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఆర్థిక ప్రోత్సాహం, బ్రాహ్మణ యువతకు పోటీ పరీక్షల శిక్షణ వంటి పథకాలను అమలు చేసి ఎంతోమంది పేద బ్రాహ్మణ కుటుంబాల్లో వెలుగులు నింపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం, విదేశీ విద్యా పథకం కింద 780 మంది పేద బ్రాహ్మణ విద్యార్థుల కోసం రూ.20 లక్షల చొప్పున ఖర్చు చేసింది. 436 మంది విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్ అందించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకంగా 5,074 మందిని గుర్తించి, రూ.150 కోట్ల ఆర్థిక భరోసా కల్పించింది. ఇవే కాకుండా, బ్రాహ్మణుల గౌరవాన్ని మరింత పెంచేలా దేశంలోనే తొలిసారిగా, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలో రూ.12 కోట్లతో పది ఎకరాల విస్తీర్ణంలో విప్రహిత బ్రాహ్మణ సదన్ నిర్మించి, బ్రాహ్మణ సంక్షేమం విషయంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. దీంతో సంక్షేమ పరిషత్ ద్వారా అమలు చేసే పథకాలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా మీరు స్పందించి, ఎంతో మంది పేద బ్రాహ్మణులకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని కోరుతున్నాను.

# ఘోర ప్రమాదం

- నేపాల్‌లో రెండు బస్సులపై విరిగిపడ్డ కొండచరియలు
- 65మంది నదిలో పడి కొట్టుకు పోయినట్లు సమాచారం

**ఖాట్మండ్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**

నేపాల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. నారాయణఘాట్-ముగ్‌లింగ్ జాతీయ రహదారిపై తెల్లవారుజామున 3.30 సమయంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో భారీగా వర్షం కూడా కురుస్తోంది. దీంతో అదే మార్గంలో దాదాపు 65 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులపై కొండచరియలు పడడంతో ఆ రెండు బస్సులు పక్కనే ఉన్న త్రిశూన్ నదిలో పడ్డాయి. గల్లంతైన వారిలో ఏడుగురు భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. వీరు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలొస్తున్నాయి. కానీ,ఎటువంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు. మరో బస్సుపై కొండచరియలు విరిగిపడటంతో డ్రైవర్ మృతి చెందాడు. 24 మంది ప్రయాణికుల తో ఓ బస్సు కాఠ్‌మాండూ వెళుతోంది. మరో బస్సులో 41 మంది ఉన్నట్లు గుర్తించారు. వీటిని గణపతి డీలక్స్, ఏంజెల్ బస్సులుగా గుర్తించారు. వీటిల్లో గణపతి డీలక్స్‌కు చెందినదిగా భావిస్తున్న బస్సు నుంచి ముగ్గురు ప్రయాణికులు తప్పించుకొన్నారు. బస్సు ప్రమాదానికి గురికాగానే వారు దానిలోనుంచి బయటకు దూకేసినట్లు కాఠ్‌మాండూ పోస్టు పేర్కొంది. అదే మార్గంలో మరోచోట కూడా బస్సుపై కొండచరియ విరిగిపడటంతో దాని డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ బస్సు బుట్వాల్ నుంచి కాఠ్మాండూకు వెళుతోంది. మృతుడిని మేఘ్‌నాథ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహల్ విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఏజెన్సీలు అక్కడ బాధితుల గాలింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ దేశ సాయుధ దళాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.

# చెత్తతో సంపద సృష్టిద్దాం

- ప్లాస్టిక్ భూతాన్ని తరిమేస్తేనే మనుగడ
- పంచాయితీల్లో చెత్తతో అనేక ఉపయోగాలు
- నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నదే సంకల్పం
- పిఠాపురం నుంచే ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తాం
- అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**

చెత్త నుంచి కూడా సంపద సృష్టించి ఆదాయం పెంచుకునేలా మార్గాలు అన్వేషించాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ సూచించారు. ఇదే లక్ష్యంతో సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. తాడేపల్లిలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం ఆ శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలిసారి కార్యాలయానికి వచ్చిన ఆయనకు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పవన్ సందర్శించారు. అనంతరం ఎస్ఎల్ఆర్ఎం వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులు.. భీమవరం, పిఠాపురం, గొల్లప్రోలు లో ఈ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు వివరించారు. డ్రైనేజ్ టు డైమండ్ అనే కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును రూపొందించారని ఎల్ఎల్ఆర్ఎం రిసోర్స్ ప్రతినిధి శ్రీనివాసన్ పేర్కొన్నారు. 12 గంటల్లో చెత్తను కలెక్ట్ చేయగలిగితే అది సంపదే అవతుందని.. పనికి రాని చెత్త వేరే అవసరాలకు సంపదగా మారుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో తొలిసారిగా ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్ట్ చేపడతున్నామని.. శ్రీనివాసన్ గత రెండు దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్నారని చెప్పారు. ప్రజలు సైతం ఈ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీనిపై అవగాహన కల్పించేందుకు మాస్టర్ ట్రైనర్స్‌ను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. 'పంట కాల్వ కనిపిస్తే కొందరు డంపింగా యార్డుగా మార్చేస్తున్నారు. పంచభూతాల్లో నీరు ఉంది. నీటిని మనం పూజలకు ఉపయోగిస్తాం. అలాంటి జలాన్ని కాలుష్యం కాకుండా కాపాడుకోవాలి. ప్రస్తుతం పర్యావరణానికి అతి పెద్ద సమస్య ప్లాస్టిక్. ప్లాస్టిక్, చెత్తా చెదారంతో ఇబ్బందులు వస్తున్నాయి. మనం గోవులను పూజిస్తాం. ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల ఆవులు చనిపోవడం బాధాకరం. ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టులో ఈ ఇబ్బందులు తొలుగుతాయి. ఈ ప్రాజెక్టును మా కార్యాలయంలో.. మా పార్టీ ఆఫీసులో ప్రారంభిస్తాం. ఈ ప్రాజెక్టును అమలు చేయగలిగితే పంచాయతీలు, మున్సిపాల్టీలకు ఆదాయం వస్తుందని పవన్ వివరించారు. మన జీవితంలో చెత్త ఒక భాగంగా మారిందని అన్నారు. మన దేశం నదులు, సంప్రదాయాలు, పూజలకు విలువ ఇస్తామని.. కానీ నదుల సంరక్షణకు చర్యలు తీసుకోబోమన్నారు. పంట కాలువలను డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారని.. ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నారని పవన్ పేర్కొన్నారు. వాటిని తిని గోవులు చనిపోతున్నాయన్నారు. గోవులను పూజించడమే కాదు.. వాటి బాగు కూడా చూడాలి. మనకి పనికిరాని వస్తువులతో సంపద సృష్టించవచ్చు. చెత్తను ఊడ్చి పడేయటం వరకే... తరువాత ఏమిటి అని ఆలోచన చేయడం లేదు. పిఠాపురంలో తొలుత ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నాం. రోజుకు రెండు సార్లు చెత్త కలెక్ట్ చేసి.. కొత్త సంపద సృష్టిస్తాం. ప్రజలు కూడా దీనిని బాధ్యత తీసుకుని సహకరించాలన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో అన్ని కాలనీల్లో అమలు చేస్తాం. మాస్టర్ ట్రైనర్స్‌ను ముందు రెడీ చేసి.. వాళ్ల ద్వారా రాష్ట్రం మొత్తం శిక్షణ ఇస్తాం. ఇది వ్యక్తి తో మొదలైనా... వ్యవస్థ మొత్తం అమలు చేయాలి. నా పార్టీ ఆఫీస్, నా క్యాంపు ఆఫీస్, నా నియోజకవర్గంలో నేను మొదలు పెడతా. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా కూడా కొన్ని మార్పులు తీసుకు వస్తాం. పంచాయతీల ద్వారా మోటివేషన్ తీసుకు వస్తాం. 101 గ్రామ పంచాయతీల్లో చెత్తతో రూ.2600 కోట్లు ఆదాయం సమకూరింది. రెండున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయి. స్వచ్ఛాంధ్ర ద్వారా దీనిని ప్రజల్లోకి తీసుకెళతాం. ప్రజలంతా దీనిపై అవగాహన పెంచుకోవాలి. చెత్త ద్వారా వచ్చే సంపదను ఆయా కార్మికులకు కేటాయిస్తాం. బ్లీచింగ్ పౌడర్‌కే పంచాయతీల్లో డబ్బులు లేని పరిస్థితి. పంచాయతీకి నిధులు సమకూర్చే సవాల్‌ను స్వీకరించి ముందుకు సాగుతాం. గ్రామాల్లో రోడ్డు వెంట కొబ్బరి చెట్లు పెంచడం ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకుంటాం. పంచాయతీలను అనేక కారణాలతో నిర్వీర్యం చేశారు. సమూలంగా ప్రక్షాళన జరగాలి. స్వయం సమృద్ధిగా పంచాయతీలు ఎదగాలి. అల్లావుద్దీన్ అద్భుత దీపంలా అన్ని పరిష్కారాలు ఒకేసారి అయిపోవు. ఈ ప్రాజెక్టును ముందు అమలు చేసి.. ఫలితాల చూసి.. అన్నిచోట్ల అమలు చేస్తాం అని అన్నారు. దీనికి కమ్మిట్మెంట్ ఉండే లీడర్ షిప్ ఉంటేనే ఇది సాధ్యం. పిఠాపురంలో 54 పంచాయతీల్లో మేము చేసేది చేయగా.. యన్ఆర్ఐలు ముందుకు వస్తే వారి సాయం తీసుకుంటాం అని పవన్ పేర్కొన్నారు. సర్వీస్ అంటే ఎవరూ రారు.. చెత్తతో సంపద వస్తుంది అంటేనే ముందుకు వస్తారు. అన్ని అనర్దాలకు ఒకే ఐఏయస్ కారణం. ఏ సమీక్ష చేసినా... ఆయనే మూల కారణం అంటున్నారు. ఆయన ఇప్పుడు సర్వీసులో లేరు. ఎవరిని బాధ్యులను చేయాలి, నిధులు ఎలా రికవరీ చేయాలి? కేవలం కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం పంచాయతీలకు రాష్ట్ర వాటా ఇవ్వలేదు. కేంద్రం కూడా నమ్మకం పోయి నిధులు ఆపేసింది. 70:30 నిధులు ఇస్తే పని అయ్యేది.. అది జరగలేదు. రకరకాల పేర్లు చెప్పి నిధులు మొత్తం మళ్లించారు. ముందు ఖర్చు పెట్టండి, తరువాత బిల్లు ఇస్తాం అని నమ్మబలికారు. డబ్బులు వచ్చినా.. రోడ్లు వేసిన కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం ఇవ్వలేదు. అన్ని వ్యవస్థ ల్లో, పథకాల్లో ఇటువంటి ఛాలెంజ్‌లు ఉన్నాయి. వీటిని పెట్టుకుని

# మొక్కలు నాటి సంరక్షించండి

- ఇది అందరి బాధ్యతగా గుర్తించండి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హనుమకొండ, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**

సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కాకతీయ వైద్య కళాశాలలో ట్రైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్‌యుహెచ్ఎస్ రిజిస్ట్రార్ సంధ్య, కెయంసి ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాం కుమార్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేందర్, విశ్రాంత డిఎఫ్ఓ పురుషోత్తం, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, శ్రవణ్‌లతో పాటు వైద్య విద్యార్థులతో కలిసి కేయంసి ఆవరణలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భవిష్యత్తు తరాల మనగడ కోసం కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు గాను విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఒక యజ్ఞంలా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. చెట్లను పెంచడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. మొక్కల పెంపకం ఆవశ్యకత గురించి ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వ హించాలని వైద్య విద్యార్థులకు సూచించారు. కాళోజీ నారాయ ణరావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లే మూలా ధారమనే విషయాన్ని గుర్తించి ప్రతి పౌరుడు మొక్కలను నాటాలని సూచించారు. కెయంసి ప్రిన్సి పాల్ డాక్టర్ మోహన్ దాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సవాల్‌గా స్వీకరించి వన మహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెయంసి జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షులు అజయ్ కుమార్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మెడికల్ స్టూడెంట్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అశ్విని నవదీప్, జూనియర్ డాక్టర్లు మొక్కలు నాటారు.

# అవినీతి నుంచి బయటపడేందుకు కేసీఆర్ యత్నాలు

- అందుకే ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపుతున్నారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్వయంగా కేసీఆరే కాంగ్రెస్‌లోకి పంపు తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు మార్ సంచలన ఆరోపణలు చేశారు. శంషాబాద్‌లో జరిగిన బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ అవినీతి నుం చి బయట పడేందుకు కాంగ్రెస్‌కు... కేసీఆర్ సహకరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఏకైక గ్యారంటీ నరేంద్ర మోదీ అని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రజాప్రతినిధులు కూడా మోదీ మాత్రమే గ్యారంటీ అంటున్నారని చెప్పారు. సెక్యూరిటీ లేకుండా ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని రాహుల్ గాంధీకి ఆయన సవాల్ విసిరారు. రాహుల్ గాంధీని సొంత పార్టీ వారే ప్రధాని అభ్య ర్థిగా అంగీకరించ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు బీజేపీ పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యకర్తల గెలుపే రాష్ట్ర బీజేపీ నాయకత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీతో తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. నిరుద్యోగులను పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అణిచి వేస్తోం దని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను ప్రజలు వ్యతిరేకించారనటానికి లో క్‌సభ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యకర్తల పోరాటం తోనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8సీట్లు వచ్చాయన్నారు. రైతులను మోసం చేసే విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్?..

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు ఎదురుదెబ్బ

- బెయిల్ పిటిషన్లు కొట్టేసిన నాంపల్లి కోర్టు

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**


ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నాంపల్లి కోర్టులో నిందితులు దాఖలుచేసిన మ్యాండేటరీ బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. ఏ2 ప్రణీత్‌రావు, ఏ3 తిరుపతన్న, ఏ4 భుజంగరావు, ఏ5 రాధాకిషన్‌రావులకు కస్టడీ పూర్తయిందని, ఇప్పటివరకు ఛార్జిషీట్ నమోదు కానందున వారికి బెయిల్ ఇచ్చే అధికారం కోర్టుకు ఉందని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. వారి వాదనలపై అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు.. ఛార్జిషీట్ దాఖలు చేశామని, దాన్ని తిప్పి పంపినంత మాత్రాన అసలు దాఖలు చేయనట్టు కాదు అన్నారు. గురువారం ఇరువైపులా వాదనలు ముగియగా.. న్యాయమూర్తి ఇవాళ తీర్పు వెలువరించారు.

# ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు ముమ్మరం

- నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్), జూలై 12:**

మార్కెట్లో రోజు రోజుకూ నకిలీ ఉత్పత్తులు పెరిగిపోతున్నాయి. ఆహార పదార్థాలను నకిలీ చేసి అమ్ముతున్న వారిపై పోలీసులు, ఫుడ్ స్టేఫ్టీ అధికారులు చర్యలు తీసుకుంటు న్నప్పటికీ ఏదో ఒక చోట నకిలీలు తయారవుతూనే ఉన్నాయి. నకిలీ ఉత్పత్తుల తయారీపై అధికారులు కొరడా ఝుళిపించినప్పటికీ తయరీదారులు వెనక్కి తగ్గడంలేదు. ఎంతో రహస్యంగా నకిలీ ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. తాజాగా... బుద్వేల్‌లోని గ్రీన్ సిటీలో గోప్యంగా తయారు చేస్తున్న నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ఫ్యాక్టరీపై సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. దాదాపు రూ.15 లక్షల విలువ గల 7.3 టన్నుల పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమీర్ నిజాన్ అనే వ్యక్తి... అప్ప ఎంటర్ప్రైసెస్ పేరుతో ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో అక్కడకు చేరుకున్న ఎస్ఓటీ పోలీసులు నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా సింథటిక్ కలర్స్, యాసిడ్స్, కెమికల్ వాటర్ వాడుతున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి పరీక్షలు జరుపుతున్నట్లు సమాచారం.







# తనకు తానే సాటి అనిపించుకున్న కమల్..

## అవినీతిపై పోరాటంతో మరోసారి మెస్మరైజ్

నటనలో ఏ మాత్రం తనకు సాటిలేదని కమలహాస్ మరోమారు నిరూపించాడు. శంకర్ మార్క్ సినిమాతో చాలా ఏళ్ల తరవాత మరోసారి అవినీతిపై పోరాటం చేశారు. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై ప్రయోగాలు చేసే విషయంలో ఎంతటి రిస్క్ అయినా చేసే యాక్టర్లలో కమల్ హాసన్ ముందుంటాడు. అవినీతి, లంచం లాంటి అంశాలను కమల్ హాసన్ టైటిల్ రోల్‌లో భారతీయుడు సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై చూపించి.. అప్పట్లోనే గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు దర్శకుడు శంకర్. మళ్లీ 28 ఏండ్ల తర్వాత అదే కథాంశంతో తెరకెక్కించిన సీక్వెల్ ఇండియన్2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో సందడి చేస్తోంది. తెలుగులో భారతీయుడు 2గా విడుదలైంది. అవినీతి అంశాల చుట్టూ తిరిగే సన్నివేశాలతో శంకర్ స్టైల్‌లో మొదలవుతుంది ఇండియ న్ 2. మెల్లగా సిద్దార్థ్ సింపుల్ ఇంట్ర డక్షన్‌తో సిల్వర్ స్క్రీన్‌పైకి ఎంట్రీ ఇస్తాడు. దేశవ్యాప్తంగా అవినీతి రోజు రోజుకీ ఎలా పెరిగిపోతుందో తెలియజేసేలాసిద్దార్థ్ అండ్ గ్యాంగ్ సోషల్ మీడియాలో వీడియోలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుంటారు. అటు నుంచి రకుల్ ప్రీత్ సింగ్ పరిచయం ఉంటుంది. కట్ చేస్తే.. కథ తైవాన్‌కు మారిపోతుంది. ఇక మొదటి సాంగ్ టైం.. క్యాలెండర్ సాంగ్‌తో బాలీవుడ్ యాక్టర్ గుల్షన్ గ్రోవర్ స్టైలిష్ ఎంట్రీ ఇస్తాడు. అసలు ఇండియన్ 2ఎంట్రీ ఎప్పుడెప్పుడు ఉంటుందా..? అని ఎదురుచూస్తున్న ప్రేక్షకుల కోసం ఉలగనాయగన్ వస్తాడు. సేనాపతిగా ఎంట్రీ ఇచ్చిన కమల్ హాసన్ మార్షల్ ఆర్ట్సులో స్కిల్స్‌ను సిల్వర్ స్క్రీన్‌పై ప్రజెంట్ చేసే సన్నివేశాలు ఉంటాయి. ఇక అవినీతి రాజ్యమేలుతున్న భారతదేశంలోకి సేనాపతి ప్రవేశం అనివార్యమైన సందర్భంలో ఇండియాలో ల్యాండింగ్ అవుతాడు సేనాపతి. ఇప్పుడు సేనాపతిగా టైటిల్ రోల్‌ను ఎలివేట్ చేసేలా తాత వస్తడే సాంగ్ ఉంటుంది. శంకర్ మార్క్ విజువల్స్‌తో గ్రాండ్‌గా సాగే ఈ పాట సినిమాకు హైలెట్‌గా చెప్పొచ్చు. అనంతరం సిద్దార్థ్ అండ్ గ్యాంగ్‌పై వచ్చే కొన్ని సన్నివేశాలుంటాయి. ఇక బాబీ సింహా చుట్టూ తిరిగి ఇన్వెస్టిగేటివ్ సన్నివేశాలతో సెకండాఫ్ షురూ అవుతుండగా.. మరోవైపు రకుల్ ప్రీత్ సింగ్ ఫ్యామిలీ సీన్లు వస్తాయి. అప్పటిదాకా ఒక మాదిరిగా సాగిన కథ కొంచెం సీరియస్ మూడ్‌లో వచ్చేస్తుంది. కొన్ని భావోద్వేగ సన్నివేశాల తర్వాత కీలక మలుపు ఎంటో తెలుస్తోంది. కమల్ హాసన్ చేజింగ్ సీక్వెన్స్, ముష్కర మూకలతో ఫైట్ సీక్వెన్స్ వన్ మ్యాన్ షోలా సాగు తుంది. చిన్నపాటి ట్విస్ట్ ఇస్తూ ఊహించని విధంగా సినిమాకు శుభం కార్డు పడుతుంది. కమల్ హాసన్, సిద్దార్థ్ అండ్ గ్యాంగ్ సన్నివేశాలతో ఒకే అన్నట్టుగా సాగుతుంది. కొన్ని సన్నివేశాలు బాగానే వర్కవుట్ అయినా.. మరికొన్ని సీన్లు మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ఫెయిలయ్యాయనే భావన ప్రేక్షకుల్లో కలుగుతుంది. విజువల్స్ క్లీన్‌గా ఉన్నప్ప టికీ.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇంకా గట్టిగా ఇచ్చి ఉంటే బాగుంటుందని మూవీ వలర్స్ అభిప్రాయపడుతున్నారు. కమల్ హాసన్ స్టన్నింగ్ పర్ఫార్మెన్స్‌తో వన్ మ్యాన్ ఆర్మీ షోలా సెకండాఫ్ సాగుతుంది. ఎప్పటిలాగే మరో బలమైన సామాజిక సందేశాన్ని అందించే ప్రయత్నం చేశాడు శంకర్. కానీ ఈసారి మాత్రం ఎగ్జిక్యూషన్‌లో కొంత వెనకబడ్డాడనే టాక్ వస్తోంది. చివరి 30 నిమిషాల్లో వచ్చే సన్నివేశాలు మాత్రం కళ్లార్పకుండా చూసేలా గూస్‌బంప్స్ తెప్పించే సన్నివేశాలతో సాగుతుంది. శంకర్‌కు పర్ఫెక్ట్ కమ్ బ్యాక్ ఇది అని అంటున్నారు నెటిజన్లు.

# 15నుంచి సర్దార్-2 షూటింగ్ స్టార్ట్




## కథను నమ్మి సినిమాలు చేసే స్టార్

యాక్టర్లలో ఒకరు కోలీవుడ్ నటుడు కార్తీ. ఈ స్టార్ హీరో కాంపౌండ్ నుంచి సినిమా వస్తుందంటే అంచనాలతో పాటు క్యూరియాసిటీ పీక్ స్టేజ్‌లో ఉంటుందని ప్రత్యేకించి చెప్పవవసరం లేదు. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి టైటిల్ రోల్‌లో నటించిన సర్దార్ బాక్సాఫీస్ ను షేక్ చేసిందని తెలిసిందే. ఇప్పుడిక సీక్వెల్ సర్దార్2 కూడా వచ్చేస్తుంది. మిషన్ కంబోడియా నేపథ్యంలో సాగే సర్దార్ 2 ఎప్పుడెప్పుడు ప్రేక్షకుల ముందుకొస్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం క్రేజీ వార్త రానే వచ్చింది. సర్దార్ 2 పూజా కార్యక్రమం ఇటీవలే చెన్నైలో ప్రారంభమైంది. జులై 15 నుంచి సర్దార్ 2 రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని తెలియజేశారు మేకర్స్. ఈ మూవీ పూజా సెర్మనీ స్టిల్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. తాజా టాక్ ప్రకారం చెన్నైలో వేసిన భారీ సెట్‌లో సర్దార్ 2 షూటింగ్ కొనసాగనుంది. సీక్వెల్‌ను కథానుగుణంగా కజకిస్తాన్,అజర్‌బై జాన్, జార్జియాలో చిత్రీకరించనున్నారట మేకర్స్. ఈ చిత్రంలో అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్ కీలక పాత్రలో కనిపించబోతుండగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ మూవీకి యువన్ శంకర్ రాజా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్.



# సౌత్ ఫిలింఫేర్ అవార్డుల ప్రకటన

## ఆర్ఆర్ఆర్, సీతారామం చిత్రాలకు అవార్డుల పంట




2023 సంవత్సరానికి సౌత్ ఫిలింఫేర్ అవార్డులను ప్రకటించారు. వీటిలో ఆర్ఆర్ఆర్ , సీతారామం చిత్రాలు సత్తా చాటి ఎక్కువ అవార్డులను దక్కించుకున్నాయి. విరాటపర్వం రెండు అవార్డులను కైవసం చేసుకుంది. ముఖ్యంగా సాయి పల్లవి తమిళంలో ఉత్తమ నటిగా, తెలుగులో క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటిగా రెండు భాషల్లో అవార్డులు దక్కించుకోవడం విశేషం. అంతేగాక సౌత్ ఇండియాలో తక్కువ కాలంలో ఆరుసార్లు ఫిలింఫేర్ అవార్డు దక్కించుకున్న కథానాయికగా రికార్డు సృష్టించింది. ఇంతకు ముందు నాలుగుసార్లు, ఇప్పుడు రెండు అవార్డులతో కలుపుకుని మొత్తంగా 6 అవార్డులు రాగా ఇందులో 4 అవార్డులు తెలుగు చిత్రాలకే రావడం గమనార్హం. రామ్ చరణ్ కు 4వ సారి అవార్డు దక్కింది. ఇప్పటికే 17 ఫిలింఫేర్ అవార్డులతో దేశంలోనే టాప్ ప్లేస్‌లో ఉన్న కమల్ హసన్ ఖాతాలో 18వ సారి అవార్డు వచ్చి చేరింది. అదేవిధంగా తమిళంలో ధనుష్ నటించిన తిరు సినిమా అధికంగా అవార్డులు గెలుచుకోవడం విశేషం.

తెలుగులో ఉత్తమ చిత్రం (ఆర్ఆర్ఆర్)..ఉత్తమ దర్శకుడు రాజమౌళి (ఆర్ఆర్ఆర్)..ఉత్తమ నటులు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ (ఆర్ఆర్ఆర్)..ఉత్తమ నటి మృణాల్ ఠాకూర్ (సీతారామం)..ఉత్తమ సంగీత దర్శుడు కీరవాణి (ఆర్ఆర్ఆర్)..ఉత్తమ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి (సీతారామం)
ఉత్తమ గాయకుడు కాల భైరవ (ఆర్ఆర్ఆర్ ,కొమరం భీముడో)..ఉత్తమ గాయని (ఫిమేల్) చిన్మయి శ్రీపాద (సీతారామం)..ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) సీతారామం..ఉత్తమ నటుడు (క్రిటిక్స్) దుల్కర్ సల్మాన్ (సీతారామం)
ఉత్తమ నటి (క్రిటిక్స్) సాయి పల్లవి ( విరాట పర్వం)..ఉత్తమ సహాయ నటుడు రానా (భీమ్లా నాయక్)
ఉత్తమ సహాయ నటి నందితా దాస్ (విరాట పర్వం)..ఉత్తమ సినిమాటోగ్రఫీ సెంథిల్, రవి వర్మన్
ఉత్తమ ప్రొడక్షన్ డిజౌన్ సాబు సిరిల్ (ఆర్ఆర్ఆర్)..ఉత్తమ నత్య దర్శుడు ప్రేమ్ రక్షిత్ (ఆర్ఆర్ఆర్)